సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 10 । మే । 2025



మహాప్రసాదం.. అందిన వారిదే భాగ్యం

'మహాప్రసాదం.. అందిన వారిదే భాగ్యం' అంటూ భక్తులు పోటీపడ్డారు. బ్రహ్మంగారిమఠంలో జరిగిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు ముగిశాయి. -12లో



వేలం పాటలు వాయిదా

పెద్దతిప్పసముద్రంలో శ్రీ విరూపాక్షేశ్వర, శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయాలకు చెందిన భూములను కౌలుకు ఇచ్చేందుకు నిర్వహించిన వేలంపాటలు వాయిదా పడ్డాయి. -12లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.82	రూ.95
రెండోరకం	రూ.64	రూ.80

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 540 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	580	600
బైవోల్టిన్	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 229.540 కిలోలు



న్యూస్‌రీల్

'సాక్షి'పై కక్షసాధింపు చర్యలు



మాట్లాడుతున్న నిసార్‌అహ్మద్

మదనపల్లె రూరల్: కూటమిప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని ప్రజాక్షేత్రంలో ఎండగడుతూ, వాస్తవాలను వెలుగులోకి తెస్తున్నందుకు సాక్షి పత్రికపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం తగదని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వ, అవినీతి, అక్రమాలపై వార్తలు రాసినందుకు సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డిపై పోలీసులు వేధింపు చర్యలకు పాల్పడటం శోచనీయమన్నారు. పత్రికా స్వేచ్ఛను హరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. దేశం మొత్తం యుద్ధవాతావరణం నెలకుని ఉంటే...ఆంధ్రప్రదేశ్‌లో కూటమిప్రభుత్వం అక్రమకేసులపై దృష్టి పెట్టిందని ఎద్దేవా చేశారు. ప్రజాసమస్యలు, అభివృద్ధి, సూపర్ సిక్స్ హామీలు విస్మరించి, డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా వైఎస్సార్ సీపీ నాయకులు, సాక్షి పత్రికపై కూటమిప్రభుత్వం అక్రమకేసులు పెడుతోందన్నారు.

భద్రకాళీ..శరణం మమ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రాయచోటి టౌన్: భద్రకాళీ శరణం మమ అంటున్న భక్తుల నామస్మరణతో రాయచోటి శ్రీ భద్రకాళీ ఆలయం మార్మోగింది.శుక్రవారం అమ్మవారికి రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని అర్చకులు రంగు రంగుల పూలు, బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలతో అలంకరించారు.అభిషేకాలు జరిపారు.మహిళా భక్తులు నిమ్మకాయలపై ఒత్తులు వెలిగించి హారతులు పట్టారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. కార్యక్రమంలో ఈవో డీవీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12, 13 తేదీల్లో గాలివీటమ్మ తిరునాల



విశేష అలంకారంలో అమ్మవారు

గాలివీడు: మండల కేంద్రంలోని పవిత్ర కుషావతీ నదీ తీరాన వెలసిన గాలివీటమ్మ తిరునాల ఈనెల 12, 13 తేదీల్లో జరగనుంది. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ఇక్కడ వారు మాట్లాడుతూ 12వ తేదీ సిద్దలకూడు నైవేద్యంతో తిరునాలకు అంకురార్పణ జరగుతుందన్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. అదే సమయంలో విద్యుత్ కాంతులతో మిరిమిట్లు గొలిపే చాందినీబండ్ల ఊరేగింపు ఉంటుందని తెలిపారు. 13వ తేదీ ఉదయం మహిళలు బోనాల రూపంలో మొక్కులు చెల్లిస్తారన్నారు.ఆసాధుని కథతో తిరునాల ఘట్టం చివరి అంకానికి చేరుకుంటుందని వివరించారు.

సైబర్ నేరగాళ్ల సందేశాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యాసాగర్ నాయుడు, జిల్లా ఎస్పీ

రాయచోటి: ఆర్మీకి విరాళాలు ఇవ్వాలంటూ సైబర్ నేరగాళ్లు పంపుతున్న సందేశాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.సరిహద్దులో ఇండియన్ ఆర్మీ శత్రుదేశ మిస్సైళ్లను కూలుస్తుంటే సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఉద్రిక్త పరిస్థితులను అదునుగా తీసుకొని సైబర్ నేరగాళ్లు కొత్త మోసానికి తెరలేపినట్లు పేర్కొన్నారు. ఆర్మీ అధికారులం అంటూ సైనికులకు ఆర్థిక సహాయం చేయాలని సందేశాలు పంపుతూ దొరికినంత దోచుకుంటారన్నారు. ప్రభుత్వం, ఆర్మీ అధికారులు, సైనికులు ఎవరూ విరాళాలు అడగరన్నారు. ప్రజలు సెల్‌ఫోన్‌లో ఎటువంటి లింక్‌లను టచ్ చేయవద్దన్నారు. అలాగే ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయవద్దన్నారు. గుర్తు తెలియని నంబర్ల నుండి ఫోన్ కాల్ వచ్చినా, సందేశం వచ్చినా ఎట్టి పరిస్థితుల్లో స్పందించవద్దని తెలియజేశారు. ఇలాంటి సందేశాలు నమ్మి, యూపీఐ మాధ్యమాల ద్వారా డబ్బులు పంపించవద్దని ఎస్పీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అక్షరంపై అక్కసు

అక్షరాల గొంతు నులిమి.. పత్రికా స్వేచ్ఛను హరించి.. రాష్ట్రంలో రాక్షస పాలనకు చంద్రబాబు ప్రభుత్వం నాంది పలికింది.లక్షమెదళ్లను కదిలించే సిరా చుక్కలపై అక్కసు వెళ్లగక్కుతోంది. 'సాక్షి'దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లోకి ఖాకీలు చట్టవ్యతిరేకంగా చొరబడి సోదాలు చేయడాన్ని ప్రజాస్వామ్యవాదులు, గర్హిస్తున్నారు. ఇది అప్రజాస్వామికమని పేర్కొంటున్నారు. వాస్తవాలను వెలుగులోకి తెస్తూ..నిర్భయంగా వార్తలు రాసే పాత్రికేయుల గొంతునొక్కాలని చూడటం సరికాదన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి చర్యలు మంచిది కాదని జర్నలిస్టు సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు స్పష్టం చేస్తున్నారు.

- పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న ప్రభుత్వం
- 'సాక్షి'ఎడిటర్ ఇంట్లో సోదాలు అప్రజాస్వామికం
- అధికారులకు వినతి పత్రాల అందజేత

బి.కొత్తకోట: కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న మీడియా ప్రతినిధులు



రాయచోటి: జేసీ ఆదర్శరాజేంద్రన్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు





మదనపల్లె రూరల్: పత్రికా స్వేచ్ఛను రాష్ట్ర ప్రభుత్వం హరిస్తోందని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ బండపల్లి అక్కులప్ప అన్నారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించడంపై ఏపీయూడబ్ల్యూజే మదనపల్లె ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓ రాఘవేంద్రను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బండపల్లి అక్కులప్ప, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్రీనివాసగౌడ, జిల్లా కార్యదర్శి వంశీధర్, మదనపల్లె ప్రెస్ క్లబ్ కార్యదర్శి నక్కా చంద్ర మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం సాక్షి పత్రికపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, అందులో భాగంగా సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డిపై అక్రమ కేసులు పెట్టడం అన్యాయమన్నారు. గురువారం విజయవాడలో సాక్షి ఎడిటర్ నివాసానికి వెళ్లిన పోలీసులు సెర్చ్ వారంట్ లేకుండా, గంటకు పైగా విచారణ జరిపి నోటీసులు ఇవ్వడం, ఏ కేసులో విచారణ చేస్తున్నారో చెప్పకపోవడం అన్యాయమన్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కును ప్రభుత్వం గౌరవించాలని కోరారు. తమకు అనుకూలంగా లేని పత్రికలపై పోలీసులను అడ్డుపెట్టుకుని లొంగదీసుకోవాలనుకోవడం అవివేకమైన చర్య అన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ టి.షామీర్‌బాషా, మదనపల్లె ప్రెస్‌క్లబ్ కోశాధికారి ఆకులకిరణ్, ఆంధ్రప్రభ శివ, ఆంధ్రపత్రిక శ్రీనివాసులు, వే టూ న్యూస్ బాలనాగు పాల్గొన్నారు.

రాజంపేట: ఏఎస్పీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏపీయుడబ్ల్యూజే నాయకులు

ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు

రాయచోటి టౌన్: పత్రికా రంగంపై దాడి ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిదని జర్నలిస్టు సంఘాల నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం జేసీ ఆదర్శరాజేంద్రన్‌కు ఏపీయూడబ్ల్యూజే, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'సాక్షి'ఎడిటర్ ధనుంజయ రెడ్డి నివాసంలోకి పోలీసులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ప్రవేశించి సోదాలు చేయడంపై మండిపడ్డారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు.



మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఏఓ రాఘవేంద్రకు వినతి పత్రం అందిస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

ప్రశ్నించే గొంతును నొక్కివేయటం అనైతికం

రాజంపేట రూరల్: ప్రశ్నించే గొంతును పోలీసులతో నొక్కివేయాలనుకోవటం అనైతిక చర్య అని ఏపీయూడబ్ల్యూజే తాలూకా అధ్యక్షుడు ఇండ్లూరి చిన్న(బసీ) వెంకటరెడ్డి పేర్కొన్నారు. 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డి నివాసంలో ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా కూటమి ప్రభుత్వం పోలీసులతో తనిఖీలు నిర్వహించటాన్ని నిరసిస్తూ ఏపీయుడబ్ల్యూజే నాయకులు శుక్రవారం ఏఎస్పీ మనోజ్ రామనాథ్‌హెగ్డేకు వినతి పత్రం అందజేశారు.అంతకుముందు ఎస్ ఎర్రబల్లిలోని ఏఎస్పీ కార్యాలయం వద్ద ఏపీయూడబ్ల్యూజే నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉండే జర్నలిస్టులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు తగవని హితవు పలికారు.కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు బచ్చోటి భాస్కర్, ప్రతినిధులు మోడపోతుల రామ్మోహన్, తేజం రవిచంద్రప్రసాద్, పీవీఆర్‌కే రాయులు, గుర్రంకొండ త్రివిక్రమ్, మద్దికర ఓబులేసు, తుపాకుల సురేష్, డీ.నాగేంద్రప్రసాద్, బాలిపోగు సునీల్, మండ్ల శ్రీహరీ, చామంచి వేంకటసుబ్బయ్య, చౌడవరం నరసింహ, పాల్గొన్నారు.



సోదాలు అప్రజాస్వామికం

బి.కొత్తకోట: చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి నివాసంలో పోలీసులు సోదాలు చేయడం అప్రజాస్వామికమని జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వందృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ చెప్పారు.

కక్షసాధింపు చర్యలు సరికాదు

ఒంటిమిట్ట: ప్రజలకు,ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉండే పాత్రికేయులపై కక్ష సాధింపు చర్యలు తగవని ఒంటిమిట్ట మండల మీడియా ప్రతినిధులు, విలేకరులు తెలిపారు. 'సాక్షి'ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిలో పోలీసులు ముందస్తు సమాచారం లేకుండా సోదాలు నిర్వహించడం సరికాదన్నారు. ఈమేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సుబ్బయ్యకు వినతిపత్రం సమర్పించారు.



ఒంటిమిట్ట: సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

హార్సిలీహిల్స్‌పై ఒబెరాయ్ అతిథిగృహాలు

అనుకూల పరిస్థితులను వివరించిన కలెక్టర్ శ్రీధర్

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఒబెరాయ్ సంస్థ రూ.200 కోట్ల వ్యయంతో ఫైవ్ స్టార్ హోటల్ సౌకర్యాలతో అతిథి గృహాల నిర్మాణం చేపట్టేలా బృందంతో చర్చించామని కలెక్టర్ శ్రీధర్ వెల్లడించారు. శుక్రవారం ఒబెరాయ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అర్జున్ ఒబెరాయ్, ప్రెసిడెంట్ ఆర్.శంకర్ బృందం హార్సిలీహిల్స్‌పై పర్యటించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలను రూపొందించారు.ఇందులో భాగంగా హార్సిలీహిల్స్‌పై ఒబెరాయ్ సంస్థ విల్లాల నిర్మాణం కోసం 20.90 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ భూమిని పరిశీలించేందుకు బృందం రాగా వారికి కలెక్టర్ శ్రీధర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇక్కడి వాతావరణ పరిస్థితులు, పర్యాటకుల సంఖ్యతో పాటు చెన్నై, బెంగళూరు, తిరుపతిలకు దగ్గరగా ఉండడం, ఇక్కడి వసతులు సౌకర్యాలను వివరించారు. వీడియో ప్రదర్శన కూడా చూపించారు. తర్వాత బృందం కొండపైన సెరికల్చర్ భవనాల దగ్గర నుంచి జింకల బోర్డు వరకు కేటాయించిన భూమిని పరిశీలించింది. గాలిబండ పరిసరాలను తిలకించారు. కాగా భూమిని, ఇక్కడి పరిస్థితులను పరిశీలించిన బృందం సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీనిపై సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ మీడియాతో మాట్లాడుతూ బృందం పరిశీలించి వెళ్లిందని, వారి నిర్ణయం వెల్లడించాల్సి ఉందని చెప్పారు.

- కార్యక్రమంలో సర్వే ఏడీ భరత్ కుమార్, తహసిల్దార్ మహమ్మద్ అజారుద్దీన్, డిటిఓ నాగభూషణం, మేనేజర్ సాల్విన్ రెడ్డి, ఆర్ఐ వీరాంజనేయులు, సర్వేయర్ ముబారక్, సర్వే విభాగం ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఒబెరాయ్ బృందానికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ శ్రీధర్

కలెక్టర్ చర్చలు

ఒబెరాయ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అర్జున్ ఒబెరాయ్, ప్రెసిడెంట్ ఆర్.శంకర్‌లతో కలిసి పర్యాటక అభివృద్ధిపై గవర్నర్ బంగ్లాలో కలెక్టర్ శ్రీధర్ చర్చించారు. ఈ రంగంలో ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ఇక్కడ అన్ని రకాల వసతులు వారికి ఏర్పాటు చేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌తో కలెక్టర్ అన్నారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం చూపుతున్న చొరవ, సహకారంపై బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఒబెరాయ్ సంస్థ బోర్డు సమావేశంలో చర్చించి ఇక్కడ నిర్మాణాలు ప్రారంభించాలనే ఆలోచన వ్యక్తం చేశారని తెలిపారు.

50శాతం రాయితీపై పశువుల దాణా

చిన్నమండెం: పశుపోషకులకు ప్రభుత్వం 50 శాతం రాయితీపై దాణా అందజేస్తున్నదని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై తెలిపారు. చిన్నమండెం మండల కేంద్రంలోని పశువైద్య శాఖ కార్యాలయంలో రైతులకు పశువుల దాణాను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ వేసవిలో పశుగ్రాసాల కొరతను అధిగమించి, నిలకడగా పశు ఉత్పత్తులు పొందడానికి, పశువుల అమ్మకాలను నిరోధించడానికి 50 శాతం రాయితీపై సమీకృత దాణాను అందించాలని నిర్ణయించామన్నారు. తెల్ల రేషన్‌కార్డు కలిగిన పశుపోషకల కుటుంబాలకు, ఒక కుటుంబానికి గరిష్టంగా రెండు పెద్ద పశువులకు, పడ్డ దూడకు 90 రోజులకు విడతల వారీగా 450 కిలోల దాణాను రాయితీపై అందిస్తామన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు, సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

అలసత్వం.. ఆలస్యం

- వాగ్గేయకారుని జన్మస్థలిలో వెంకటేశ్వరుని ఆలయం
- వైఎస్సార్‌సీపీ పాలనలో నిర్మాణం పూర్తి
- ఆలయ ప్రారంభోత్సవంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- అన్నమయ్య జయంత్యుత్సవాల తరుణంలోనైనా ప్రారంభించేనా?



అన్నమయ్య ఉద్యావనం



వైఎస్సార్‌సీపీ పాలనలో పూర్తయిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం

రాజంపేట: అదివో..అల్లదివో..శ్రీహరివాసము..బ్రహ్మకడిగిన పాదము.. అంటూ సులువైన పదాలతో కీర్తనలు అలపించారు అన్నమయ్య. ఆయన జన్మస్థలిలో నిర్మాణం పూర్తి చేసుకున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రారంభానికి నోచుకోవడంలేదు. వెంకన్న దర్శనమెప్పుడో అని భక్తులు ఎదురుచూస్తున్నారు. ఈనెల 12 నుంచి పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి ఉత్సవాలను టీటీడీ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శ్రీవారి ఆలయాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తారని, వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట చేపడతారని ఆశించారు. అయితే భక్తుల ఆశలు ఆవిరయ్యాయి.

అందుబాటులోకి తేలేకపోతున్న కూటమి ప్రభుత్వం

అన్నమయ్య ఉద్యానవనంలో దశాబ్దంన్నర తర్వాత మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి బీజం పడింది. అప్పట్లో ఎంపిక చేసిన స్థలంలో శ్రీవారి ఆలయం నిర్మించారు. టీటీడీ రూ.కోటికి పైగా వ్యయం చేస్తోంది. ఈ మార్గంలో తిరుమలకు వెళ్లే దక్షిణభారత యాత్రికులు ముందుగా అన్నమయ్య జన్మస్థలిలో శ్రీవారిని దర్శించుకోవడం మహాదానందగా భావిస్తున్నారు. తాళ్లపాక, 108 అడుగుల విగ్రహం ప్రాంతం పార్కును టీటీడీ అటవీశాఖ సిద్ధం చేసింది. ఆలయ నిర్మాణం పూర్తికావడంతో ప్రారంభానికి టీటీడీ సన్నద్ధమైంది. అయితే ఆలయాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని కూటమి ప్రభుత్వం యోచిస్తున్నట్లు కనిపించడంలేదు.

అటకెక్కిన అభివృద్ధి

అన్నమాచార్యుని 600 జయంత్యుత్సవాలు అప్పటి పాలకమండలి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి హయాంలో జరిగాయి. 108 అన్నమయ్య అడుగుల విగ్రహావిష్కరణకు విచ్చేసిన దివంగత సీఎం వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి అన్నమయ్య జన్మస్థలి అభివృద్ధికి సంబంధించి హామీలను ప్రకటించిన సంగతి విధితమే. హామీలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేశారు. దివంగత సీఎం వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి మరణం తర్వాత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు అన్నమయ్య థీంపార్కు(108 అడుగుల అన్నమయ్య విగ్రహ ప్రాంతం) అభివృద్ధి ఆటకెక్కించేశారు.దీని గురించి పట్టించుకునేవారు కరువయ్యారు. అప్పటి టీటీడీ పాలకమండలి తాళ్లపాక, అన్నమయ్య థీంపార్కు అభివృద్ధికి సంబంధించి నిధుల కేటాయింపుల ఊసే ఎత్తలేదు.వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో టీటీడీ చైర్మన్లుగా వ్యవహరించిన వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి అన్నమయ్య జన్మస్థలి అభివృద్ధిపై దృష్టి సారించారు.పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు.అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో పాలకమండలి అన్నమయ్య జన్మస్థలిపై కన్నెత్తి చూడటంలేదన్న విమర్శలు ఉన్నాయి.

ఆలయాన్ని ప్రారంభించాలి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 108 అన్నమయ్య అడుగులప్రాంతంలో శ్రీవారి ఆలయాన్ని నిర్మించారు. కూటమి ప్రభుత్వం ఇంతవరకు దీనిని భక్తులకు అందుబాటులో తీసుకురాలేకపోయింది. శ్రీవెంకటేశ్వర స్వామి విగ్రహప్రతిష్ట చేయలేకున్నారు. ఆ దిశగా టీటీడీ దృష్టి సారించడంలేదు. ఇప్పటికైనా టీటీడీ బోర్డు స్పందించి ఆలయాన్ని ప్రారంభించాలి. భక్తులకు అందుబాటులో తేవాలి

-పాపినేనివిశ్వనాథరెడ్డి, జిల్లా అధికారప్రతినిధి, వైఎస్సార్‌సీపీ

శ్రీవారి విగ్రహప్రతిష్ట చేయాలి



అన్నమయ్య థీం పార్కులో నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి విగ్రహ ప్రతిష్ట చేయాలి. తిరుపతికి వెళ్లే దక్షిణభారత యాత్రీకుల తోపాటు రాయలసీమ వాసులకు అన్నమయ్య థీంపార్కులో వసతి సముదాయాలు కూడా ఏర్పాటు చేయాలి. శ్రీవారి ఆలయాన్ని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలి. ఇందుకోసం టీటీడీ అధికారులు చర్యలు చేపట్టాలి

-జీవీరమణ యాదవ్, ఎస్టీయూ మాజీనేత, నందలూరు

అన్నమయ్య ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసేందుకు కృషి

- అన్నమాచార్య ప్రాజెక్ట్ స్పెషలాఫీర్ మేడసానిమోహన్



తాళ్లపాకలో మేడసానిమోహన్

రాజంపేట: పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుని ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసేందుకు తన వంతు కృషిచేస్తానని టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి మేడసాని మోహన్ అన్నారు. శుక్రవారం తాళ్లపాక, 108 అన్నమయ్య అడుగుల విగ్రహం ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమాచార్య ప్రాజెక్టు డైరక్టర్‌గా చాలా సంవత్సరాలు పని చేశానని, మళ్లీ స్వామికి సేవ చేసే భాగ్యం కలిగిందన్నారు. ఈనెల 12న అన్నమయ్య జయంతి ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయం, సంగీత సభల వేదిక, ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న మండపాలను పరిశీలించారు. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సీనియర్ అసిస్టెంట్ లోకనాథరెడ్డి, కో-ఆర్డినేటర్ లత, తాళ్లపాక గ్రామపెద్దలు పాల్గొన్నారు. అంతకముందుగా తాళ్లపాకలోని అన్నమాచార్య ధాన్యమందిరంలో అన్నమయ్య విగ్రహానికి నిర్వహించిన పూజల్లో మేడసానిమోహన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైరు చోరీ


ట్రాన్స్‌ఫార్మర్ విడి భాగాన్ని పడేసి వెళ్లిన దొంగలు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని పున్నాటి వారిపల్లి గ్రామ సమీప పంట పొలాల్లో ట్రాన్స్ ఫార్మర్‌లోని రాగి వైరు చోరీకి గురైంది. రైతు ఓబిలి రవీంద్రారెడ్డి పొలం వద్ద 364 విద్యుత్ సర్వీసు ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. పొలంలో పంటలు సాగు చేయలేదు. ఈ క్రమంలో దొంగలు రాత్రి సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందికి దించి లోపల ఉన్న రాగి వైరును తీసుకెళ్లారు. ట్రాన్సుఫార్మర్ విడిభాగాలు చెల్లాచెదురుగా పారేసి వెళ్లిపోయారు. నాలుగైదు రోజులు పొలం వైపు వెళ్లలేదని, శుక్రవారం వెళ్లి చూసేసరికి చోరీ జరిగిందన్న విషయం గుర్తించామని రైతు రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, విద్యుత్ శాఖ మండల అధికారికి తెలియజేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి


ప్రభుదాస్ (ఫైల్)

నందలూరు : కడప–చెన్నై ప్రధాన రహదారిలోని నందలూరు బాహుద నది వంతెన సమీపంలో శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు, మోపెడ్ (టీవీఎస్ ఎక్స్ ఎల్) ఢీకొన్న సంఘటనలో అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. రాజంపేట మండలం బోయిన పల్లె ప్రాంతానికి చెందిన గురునాథం ప్రభుదాస్(22) నందలూరు లోని తమ బంధువుల వద్దకు వచ్చి తిరిగి రాజంపేటకు వెళుతున్న సమయంలో తిరుపతి నుంచి కడపకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్ర గాయాల పాలై మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం స్థానిక పోలీసులు రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

ద్విచక్రవాహనాలు దగ్ధం

మదనపల్లె రూరల్ : మండలంలోని కొత్తవారి పల్లె పంచాయతీలో గ్రామస్తుడైన కృష్ణమూర్తి ఇంటి ముందు గురువారం రాత్రి పార్కింగ్ చేసిన రెండు ద్విచక్రవాహనాలు దగ్ధమయ్యాయని తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... కొత్తవారిపల్లెకు చెందిన కృష్ణమూర్తి గురువారం రాత్రి ఇంటిముందు హోండా యాక్టివా, టీవీఎస్ వాహనాలను ఎప్పటిలాగే పార్కింగ్ చేశాడన్నారు. అయితే శుక్రవారం ఉదయం చూసేసరికి రెండు వాహనాలు కాలిపోయి ఉన్నాయన్నారు. గ్రామానికి చెందిన మదన్‌మోహన్‌రెడ్డితో ఆర్థిక లావాదేవీలకు సంబంధించి కృష్ణమూర్తికి విభేదాలు ఉండటంతో, అతడిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువతి ఆత్మహత్య

కొండాపురం : మండల పరిధిలోని టి.కోడూరు గ్రామంలో ఓ యువతి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తాళ్లప్రొద్దుటూరు ఏఎస్ఐ ఆర్.బాసు వివరాల మేరకు.. మండలంలోని టి. కోడూరు గ్రామానికి చెందిన బుండన్నగారి రాజ వంగనూరు సమీపంలోని జాతీయ రహదారి పక్కన మొబైల్ క్యాంటీన్ పెట్టుకొని జీవనం సాగించేవాడు. బుడన్నగారి రాజ పెద్ద కుమార్తె బి.నవ్యశ్రీ(17) థైరాయిడ్‌తోపాటు కడుపు నొప్పి తాళలేక ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది.

మహాప్రసాదం.. అందిన వారిదే భాగ్యం

- ముగిసిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తజనం



ప్రత్యేక అలంకరణలో శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి, మహాప్రసాదం పంపిణీ చేస్తున్న ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజి

బ్రహ్మంగారిమఠం : 'మహాప్రసాదం.. అందిన వారిదే భాగ్యం' అంటూ భక్తులు పోటీపడ్డారు. స్వామి వారి ప్రసాదం స్వీకరించడం కోసం వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. బ్రహ్మంగారిమఠంలో ఆరు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు మధ్యాహ్నం మహాప్రసాద వినియోగం చేపట్టారు. బియ్యం, బెల్లం, నెయ్యి, జీడిపప్పు, ద్రాక్ష, యాలక్కలు, ఎండుకొబ్బరి, పాలు తదితరాలతో మహాప్రసాదాన్ని తయారు చేశారు. గర్భాలయంలో స్వామి వారి ఎదురుగా.. ఒక రాశిలా పోసి నివేదించారు. అనంతరం మఠం ఫిట్ పర్సన్ సి.శంకర్‌బాలాజి, పూర్వపు మఠాధిపతి కుమారులు ప్రసాదం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. భక్తులు స్వీకరించి కళ్లకు అద్దుకుని ఆరగించారు. మరికొందరు ఇంటికి తీసుకెళ్లారు. భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి. మహాప్రసాదానికి ప్రొద్దుటూరు నియోజకవర్గం సంకటితిమ్మాయపల్లెకు చెందిన పోలు ఎరికలరెడ్డి, సుబ్బారెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు.

మహాప్రసాదం విశిష్టత

మహాప్రసాదం అనగా గొప్ప ప్రసాదం అని అర్థం. దేవతలకు నివేదించిన తర్వాత భక్తులకు పంపిణీ చేస్తారు. ఒక్కొక్క చోట ఒక్కో విధంగా ఇస్తారు. తమిళనాడులోని అన్ని శివాలయాల్లో విభూదిని ప్రసాదంగా అందజేస్తారు. అమ్మవారి ఆలయాల్లో కుంకుమ ఇవ్వడం జరుగుతుంది. అలాగే వీరబ్రహ్మేంద్రస్వామి సన్నిధిలో 'విశేష గుడాన్నం' అందిస్తారు. దీనిని స్వీకరించిన వారికి సంతానం, వివాహం తదితర కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఉత్సవాలకు హాజరు కాలేని వారికి, తర్వాత వచ్చే వారికి ప్రసాదం అందించే పద్ధతి ఇక్కడ ఉంది. ప్రసాదాన్ని ఎండబెట్టి, తేమ లేకుండా నిల్వ చేసి సుమారు రెండు నెలల వరకు భక్తులకు అందజేస్తారు. కొందరు ప్రసాదాన్ని పార్శిల్ ద్వారా తెప్పించుకుంటారు. 'నిద్రపోవు వారికి, నా వద్ద లేని వారికి ప్రసాదం అబ్బదు' అనేది బ్రహ్మంగారి కాలజ్ఞాన వాక్యం. కావున భక్తులందరూ ప్రసాదం స్వీకరించడానికి అమితాసక్తి ప్రదర్శిస్తారు.

ఉత్సాహ భరితంగా ఉత్సవం

ఉదయం ఉత్సవ కార్యక్రమాన్ని ఉత్సాహ భరితంగా నిర్వహించారు. శ్రీ మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పీఠంపై అధిష్టింపజేసి, విశేష పూజలు చేశారు. పెద్ద మఠం నుంచి చిన్నమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. అక్కడ చిన్నమఠం మఠాధిపతులు శ్రీ వీరశివకుమారస్వామి విశేష పూజలు చేశారు. ఊరేగింపు తిరిగి పెద్దమఠం చేరుకుంది. కడప పుట్టా యాడ్స్‌కు చెందిన అమృతమ్మ, వెంకటసుబ్బయ్య శ్రేష్టి, లక్ష్మీదేవి ఉభయదారులుగా వ్యవహరించారు. తెల్లవారు జామున శ్రీవీరబ్రహ్మ సుప్రభాతం, నామ సంకీర్తనాన్ని ఆగమ వేద పండితులు ఇడమకంటి జనార్దన శివాచార్య, పోలేపల్లి రామబ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భాలయంలోని స్వామి, అమ్మవారి అర్చనామూర్తులకు గంగ, పంచామృతం, క్షీరం, ఫలోదకంలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక వస్త్రాలంకరణ చేశారు. స్వామి గుణగణాలను కీర్తిస్తూ, 108 నామాలతో స్తుతిస్తూ సహస్ర నామార్చన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం వేద పారాయణం చేశారు. కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతి శ్రీ వీరభోగ వసంతవెంకటేశ్వర స్వామి కుమారులు శ్రీ వెంకటాద్రిస్వామి, వీర భద్రయ్యస్వామి, వీరం బొట్లయ్యస్వామి, దత్తా త్రేయస్వామి, గోవిందస్వామి, వరదరా జస్వామి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మఠం ఫిట్‌పర్సన్ సి.శంకర్‌బా లాజి, మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి ఏర్పాట్లు చేశారు. ఎస్ ఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

వేలం పాటలు వాయిదా

దేవదాయ శాఖ అధికారుల ధోరణిపై మండిపడ్డ రైతులు


వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

పెద్దతిప్పసముద్రం : మండల కేంద్రంలో శుక్రవారం శ్రీ విరూపాక్షేశ్వర, శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయాలకు చెందిన 13.25 ఎకరాల దేవదాయ భూములను మూడేళ్ల పాటు కౌలుకు ఇచ్చేందుకు అధికారులు బహిరంగంగా వేలం పాటలు నిర్వహించారు. అయితే గతంలో కన్నా ఈ సారి భూములను వేలంలో దక్కించుకునేందుకు రైతులు అధికంగా ఆసక్తి చూపారు. ఈ తరుణంలో ఓ రైతు ఏడాదికి రూ.55 వేలు ఇస్తామని వేలంలో ప్రకటించగా.. అధికారులు కుయుక్తులు పన్నారు. అధికార పార్టీ రాజకీయ ఒత్తిళ్ల కారణంగా హెచ్చు పాటాదారుడికి కాకుండా.. రూ.50 వేలు పలికిన మరో వ్యక్తికి కేటాయించాలని అధికారులు భావించారు. దీంతో ఒక్కసారిగా అక్కడ అధికారులు, కౌలు రైతుల నడుమ వాగ్వివాదాలు చోటు చేసుకోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ప్రశాంతంగా ఉంటున్న రైతుల నడుమ.. మీరు కక్షలు పెరిగేలా వ్యవహరిస్తారా అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలంపాటలు సక్రమంగా నిర్వహించండి లేకుంటే బీళ్లుగా పెట్టేయండని రైతులు అధికారులకు తెగేసి చెప్పారు. మీకు ఇష్టమొచ్చినట్టు కాదు బహిరంగ వేలంలో ఎవరైతే హెచ్చుగా పాడుకుంటే వారికే కౌలుకు ఇవ్వండి, ఏకపక్షంగా వ్యవహరిస్తే మాత్రం సహించేది లేదని అధికారులపై పలువురు రైతులు మండి పడ్డారు. ఇదిలా ఉండగా గతంలో వేలం పాటలను బహిరంగంగా వేలం వేయకుండా.. మీకు అనుకూలంగా ఉన్న పేర్లను రాసుకుని భూములను కౌలుకు ఎలా ఇచ్చారని మరి కొందరు ప్రశ్నించారు. ఎట్టకేలకు దిక్కు తోచని అధికారులు నీళ్లు నములుతూ వేలం పాటలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. వచ్చే నెల 16వ తేదీ నాటికి రైతుల ఆధీనంలో ఉన్న ఆలయ భూములకు అప్పగించాలని, పంటలు సాగులో ఉన్నా కూడా పోలీసుల సహకారంతో తాము స్వాధీనం చేసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో దేవదాయ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఈవో మునిరాజు, అసిస్టెంట్ రమణ తదితరులు పాల్గొన్నారు.

అతిథి గృహం స్వాధీనం చేసుకున్న రెవెన్యూ


అతిథి భవన సముదాయాన్ని సీజ్ చేసిన తహసీల్దార్

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై బీఎస్ఎన్ఎల్ భవనాల్లో లీజుదారు ఏర్పాటు చేసుకున్న అతిథి గృహ సముదాయాన్ని శుక్రవారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మూడేళ్ల క్రితం కేంద్ర టెలికాం శాఖ తన నిరర్థక ఆస్తులను లీజుకు అప్పగించింది. మదనపల్లికి చెందిన వ్యక్తి ఈ లీజును టెండర్ ద్వారా దక్కించుకున్నారు. తర్వాత అతిథి గృహ పనులు చేపట్టారు. దీన్ని గుర్తించిన గత కలెక్టర్ గిరీషా బీఎస్ఎన్ఎల్ కు కేటాయించిన భూమిని రద్దు చేసి స్వాధీనం చేసుకున్నారు. అప్పటికే భారీ మొత్తంలో లీజుదారు ఖర్చుచేసి ఉండడంతో మదనపల్లె గత ఆర్డీవో, టౌన్షిప్ కమిటీ తరపున టెలికాం శాఖ నుంచి లీజు పొందిన లీజుదారుకే మళ్లీ నెలవారి అద్దె లీజు ప్రాతిపదికన అప్పగించారు. అయితే నిర్వహణ చర్యలో భాగంగా లోటుపాట్లను గుర్తించడం, మురికినీరు రోడ్డు, గాలిబండ పైకి ప్రవహించడంతో పర్యాటకులకు అసౌకర్యంగా ఉందని అధికారులు గుర్తించారు. దీన్ని నిర్లక్ష్యంగా చూపించి శుక్రవారం అతిథి భవనాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయాలని సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ అజారుద్దీన్ కురబలకోట డిస్కం ఏఈకి ఉత్తర్వు జారీ చేశారు. అనంతరం తహసీల్దార్ అతిథి గృహాలను పరిశీలించి సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. అక్కడ బస చేసిన వారిని పర్యాటకశాఖ అతిథి గృహాలకు తరలించారు. దీనిపై లీజుదారులు మాట్లాడుతూ మురికి నీరు ప్రవాహం కోసం ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని పలుమార్లు లేఖల ద్వారా అధికారులను కోరడం జరిగిందని చెప్పారు. అనుమతి లేకపోవడంతో పనులు చేపట్టలేక పోయినట్టు చెప్పారు. అయితే మురికినీరు ప్రవాహమే కారణంగా చూపి స్వాధీనం చేసుకోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కమనీయం.. చెన్నకేశవస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్) కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

రాజుపాళెం : వెల్లాల పుణ్యక్షేత్రంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వాముల కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వాములకు ఉదయం విశేష అభిషేకాలు, అర్చనలు వేద పండితులు నిర్వహించారు. సంజీవరాయ కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులకు నూతన పట్టువస్త్రాలు, రంగురంగుల పూలు, పుత్తడి ఆభరణాలతో అలంకరించారు. అనంతరం కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించి, తరించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మినారాయణరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


నిందితురాలి అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

మదనపల్లె రూరల్ : ఎక్సైజ్, కడప ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా శుక్రవారం దాడులు జరిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఇన్‌స్పెక్టర్ జి.భీమలింగ మీడియాకు వెల్లడించారు. మదనపల్లె ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రెండు నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్(ఎన్‌డీపీఎల్) కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మదనపల్లె మండలం పోతబోలు దళితవాడకు చెందిన ఎస్.గణపతి భార్య సరసమ్మను అరెస్ట్ చేసి, ఆమె వద్ద నుంచి 35 టెట్రా కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కురబలకోట మండలం తెట్టు గ్రామానికి చెందిన యూ.అమరనాథ్‌ను అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 25 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. రెండు కేసుల్లోనూ నిందితుల నుంచి మొత్తం 60 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్ట్ చేశామన్నారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్ సి.నాగేంద్రమ్మ, ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ సతీష్, కానిస్టేబుళ్లు నాగరాజు, మధు, రేఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ కానిస్టేబుల్ పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

చనిపోయిన వ్యక్తి వచ్చి అర్జీ ఇచ్చాడట!

- ఆ మేరకు ప్రతివాదికి నోటీసులు పంపిన రెవెన్యూ అధికారులు

మైలవరం : నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్న రీతిలో వ్యవహరించారు మైలవరం రెవెన్యూ అధికారులు. చనిపోయిన వ్యక్తి వచ్చి అర్జీ ఇస్తే ఆగమేఘాలపై స్పందించిన మండల తహసీల్దార్.. ప్రతివాదికి నోటీసులు జారీచేసి విచారణకు రావాలంటూ కబురు పంపారు. తీరా శుక్రవారం విచారణకు హాజరైన ప్రతివాది తనపై చనిపోయిన వ్యక్తి వచ్చి స్వయంగా ఫిర్యాదు చేశాడని తెలిసి అవాక్కు అయ్యాడు. ఆద్యంతం ఆసక్తి గొలిపే ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మైలవరం మండలం ధన్నవాడ గ్రామానికి చెందిన చెక్కా బాలుడు అనే వ్యక్తికి 2005లో అప్పటి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం 346–3 సర్వే నంబర్‌లో 1.70 ఎకరాల అసైన్డ్ భూమిని మంజూరు చేసింది. ఆ మేరకు నాటి మైలవరం మండల రెవెన్యూ అధికారులు బాలుడుకు పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేశారు. నేటికి ఆ భూమికి సంబంధించిన అడంగల్, వన్‌బీ, ఆన్‌లైన్‌లో బాలుడు పేరే చూపిస్తుంది. విచిత్రం ఏమిటంటే ఆ భూమి తనది అని బాలుడి పేరును ఆన్‌లైన్‌లో తీసివేయాలంటూ వంగల శేషారెడ్డి పేరుతో ఓ వ్యక్తి.. మైలవరం మండల రెవెన్యూ కార్యాలయానికి వచ్చి ఏప్రిల్ నెలలో అర్జీ ఇచ్చాడట. అసలు అర్జీదారుడు బతికి ఉన్నాడా.. లేదా అని కూడా విచారణ చేయకుండా రెవెన్యూ అధికారులు ఈ నెల 3న బాలుడికి నోటీసులు పంపారు. ఊరు పేరు లేని వ్యక్తి తనపై ఫిర్యాదు చేయడం ఏంటని నివ్వెరపోయిన బాలుడు అధికారుల నోటీసు మేరకు విచారణకు హాజరు అయ్యాడు. తీరా అక్కడికి వచ్చిన బాలుడికి అసలు విషయం తెలిసి అవాక్కయ్యాడు.

ఆ వ్యక్తి ఊరిలో లేడంటున్న గ్రామస్తులు

చనిపోయిన వ్యక్తి ఇచ్చిన అర్జీకి మైలవరం రెవెన్యూ అధికారులు స్పందించారన్న వార్త కలకలం రేపడంతో వాస్తవాల కోసం.. సాక్షి బృందం గ్రామస్తులను ఆరా తీసింది. అసలు వంగల శేషారెడ్డి అను పేరు గల వ్యక్తి తమ గ్రామంలో ఎవరూ లేరని ధన్నవాడ గ్రామస్తులు ఘంటాపథంగా చెబుతున్నారు. మరో విచిత్రం ఏంటంటే వంగల శేషారెడ్డి అనే వ్యక్తి వెలుగోడు ప్రాంతానికి చెందిన వాడని, 20 సంవత్సరాల క్రితం కూలీ పనుల నిమిత్తం కొన్నాళ్లు ఈ ఏరియాకు వచ్చి వెళ్లాడని, ఆ తరువాత కొంత కాలానికి మరణించాడని, అతనికి ఈ భూమికి సంబంధం లేదంటూ గ్రామస్తులు చెబుతున్నారు.

స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

కడప కల్చరల్ : కడపకు చెందిన రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి గాను ప్రతిభ గల పేద రెడ్డి విద్యార్థులు స్కాలర్‌షిప్ మంజూరు కోసం కార్యవర్గంలో నిర్ణయించుకోవాలని సంస్థ సభ్యులు తెలిపారు. అర్హత గల విద్యార్థిని, విద్యార్థులు రెడ్డి సేవా సమితి కార్యాలయం నుంచి దరఖాస్తులు పొంది.. మే 31వ తేదీలోగా దరఖాస్తు పూర్తి చేసి రెడ్డి సేవా సమితి కార్యాలయంలో సమర్పించాలని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు కుప్పిరెడ్డి నాగిరెడ్డి, లెక్కల కొండారెడ్డి, గుర్ల నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను పూర్తిగా పరిశీలించిన తర్వాత అర్హులకు స్కాలర్‌షిప్ మంజూరు చేయనున్నట్లు వారు వివరించారు. వైద్య విద్య అభ్యసించే విద్యార్థి నీట్ ర్యాంకు పొంది ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రవేశం పొంది ఉండాలని, వారికి ప్రతి సంవత్సరం స్కాలర్‌షిప్ రూపంలో రూ.25 వేలు ఆర్థికసాయం చేయనున్నట్లు తెలిపారు. సాంకేతిక విద్య (బీటెక్) అభ్యసించే అభ్యర్థులు ఎంసెట్‌లో 10 వేలలోపు ర్యాంకు పొంది ఉండాలని, అలాంటి వారి స్కాలర్‌షిప్ కింద రూ. 25 వేలు ప్రతి ఏడాది ఆర్థిక సాయం అందజేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతి సంవత్సరం కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు రూ.10 వేలు, ఇతరులకు రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేయనున్నట్లు వివరించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యను అభ్యసించే విద్యార్థికి ప్రతి ఏడాది స్కాలర్‌షిప్ కింద రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. అగ్రికల్చర్ బీఎస్సీ, వెటర్నరీ బీఎస్సీ విద్యను అభ్యసించే వారికి ఎంసెట్‌లో ర్యాంకు పొంది ప్రభుత్వ కళాశాలలో ప్రవేశం పొంది ఉండాలని, అలాంటి వారికి ప్రతి సంవత్సరం స్కాలర్‌షిప్ కింద రూ.20 వేలు ఆర్థికసాయం అందజేస్తామన్నారు.

కూలీలను చితకబాదిన యజమాని

మదనపల్లె రూరల్ : టమాటా కోతలకు వచ్చిన కూలీలు పని చేయకుండా ఫోన్లు మాట్లాడుకుంటూ సమయం వృథా చేస్తుండటంతో.. ఆగ్రహం పట్టలేక యజమాని చితకబాదిన ఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. సందిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన యజమాని రమణ టమాటా పంట సాగు చేశాడు. పంట కోతలకు మదనపల్లె చంద్రాకాలనీకి చెందిన షబానా(22), ఆయిషా(26), మౌనిక(25), కనకమ్మ(30) కూలీ పనులకు వెళ్లారు. ఈ క్రమంలో పనులు చేయకుండా వారు సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ కాలక్షేపం చేస్తుండటంతో.. యజమాని రమణ వారితో వాగ్వివాదానికి దిగారు. ఆవేశంలో కూలీలను చితకబాదాడు. గాయపడిన కూలీలు, స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

నాడు మట్కా బీటర్లు.. నేడు గంజాయి విక్రేతలు

– నలుగురు అరెస్ట్, 1500 గ్రాముల గంజాయి స్వాధీనం

ప్రొద్దుటూరు క్రైం : వీరు పేరు మోసిన మట్కా బీటర్లు. ఏళ్ల తరబడి మట్కా నిర్వహిస్తూ ఎందరి జీవితాలో నాశనం కావడానికి కారకులయ్యారు. ఇటీవల పోలీసులు క్రికెట్ బెట్టింగ్, మట్కా దాడులు ముమ్మరం చేయడంతో వీళ్లు మట్కా రాయడం మానుకున్నట్లు తెలుస్తోంది. దీంతో గంజాయి విక్రయిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి ప్రొద్దుటూరులో విక్రయిస్తుంటారు. ఈ విషయం పోలీసుల చెవిన పడటంతో.. వీరి అక్రమ వ్యాపారానికి బ్రేకులు పడ్డాయి. పెన్నానదిలోని ఆర్టీపీపీ రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన షేక్ హుస్సేన్‌బాషా అలియాస్ గూగూడు, సయ్యద్ ఖాదర్ అలియాస్ కదీర్‌తోపాటు పవర్‌హౌస్ రోడ్డుకు చెందిన టప్పా నసీర్ రసూల్ , షేక్ జమాల్‌బాషాను వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 1500 గ్రాముల గంజాయి, 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. హుస్సేన్‌బాషా అలియాస్ గూగూడుపై గతంలో మట్కా, లిక్కర్, గంజాయి తదితర సుమారు 46 కేసులు ఉన్నాయి. అలాగే సయ్యద్ ఖాదర్ అలియాస్ కదీర్‌పై కూడా వివిధ పోలీస్ స్టేషన్లలో గంజాయి, మట్కా, లిక్కర్ తదితర సుమారు 48 కేసులు ఉన్నాయి. నసీర్ రసూల్, జమాల్‌బాషాలపై రెండేసి చొప్పున కేసులు ఉన్నాయి. నలుగురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండు నిమిత్తం కోర్టులో హాజరు పరచనున్నట్లు వన్‌టౌన్ సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

– మరొకరికి గాయాలు


మృతి చెందిన రామిరెడ్డి

చక్రాయపేట : మండలంలోని మారెళ్ల మడక సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మూలి రామిరెడ్డి (55)అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. ఏఎస్ఐ రాజశేఖరరెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మారెళ్ల మడక సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చక్రాయపేట మండలం కుప్పం గ్రామం బురుజుపల్లెకు చెందిన మూలి రామిరెడ్డి మృతి చెందగా, వేముల మండలం చాగలేరు గ్రామానికి చెందిన దిద్దికుంట కొండారెడ్డి గాయపడ్డారు. రామిరెడ్డి, కొండారెడ్డి కలిసి వేంపల్లెలోని ఓ వివాహానికి హాజరై బురుజుపల్లెకు వెళుతుండగా.. మారెళ్లమడక సమీపంలో మోటార్ సైకిల్ అదుపుతప్పి కింద పడ్డారు. దీంతో వెనక కూర్చొన్న రామిరెడ్డి పొలానికి వేసిన ఫెన్సింగ్ స్తంభానికి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడ్డ కొండారెడ్డిని ప్రథమ చికిత్స నిమిత్తం వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి అక్కడి వైద్యుల సూచన మేరకు కడపకు తీసుకెళ్లారు. రామిరెడ్డి మృతదేహాన్ని వేంపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం చేయించి పోలీసులు కేసు నమోదు చేశారు.

చేపల వేటకు వెళ్లి..

– కదిరి మండల వాసి కామసముద్రంలో మృతి


మృతి చెందిన హైదర్‌వలి

లింగాల : అనంతపురం జిల్లా కదిరి మండలం చెలంకూరు పల్లె గ్రామానికి చెందిన బెల్లం హైదర్‌వల్లి (58) అనే వ్యక్తి వైఎస్ఆర్ జిల్లా లింగాల మండలం కామసముద్రం గ్రామంలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా కదిరి మండలం చెలంకూరుపల్లెకు చెందిన హైదర్‌వలి అనే వ్యక్తి బేల్దారి పనుల కోసం లింగాల మండలం కామసముద్రం గ్రామానికి వచ్చారు. ఆయన కామసముద్రం చెరువులో చేపలు పట్టడానికి వెళ్లారు. ప్రమాదవశాత్తు చెరువు గట్టు మీద నుంచి చెరువులోకి పడిపోయాడు. ఈత రాకపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడు హైదర్‌వలికి ఇద్దరు కుమార్తెలు, కుమారులు ఉన్నారు. కుమారుడు బాబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. హైదర్‌వల్లి మృతదేహాన్ని పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడి మృతి

– ఫాతిమా మెడికల్ కళాశాల నిర్లక్ష్యమేనని పలువురు ఆరోపణ


ఓబులేశు మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మునెయ్య

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలోగల ఫాతిమా మెడికల్ కళాశాలలో భవన నిర్మాణ కార్మికుడిగా, కళాశాలలో కూలీ పనులు చేసే ఓబులేశు అనే వ్యక్తి విద్యుత్ షాక్ తో మృతి చెందాడు. ఆయన శుక్రవారం కళాశాల కార్యాలయ గది రెండవ అంతస్తు నిర్మాణంపై ఉన్న లిఫ్టునకు కరెంటు రావడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. వారం రోజులుగా లిఫ్టునకు విద్యుత్ షాక్ కొడుతోందని కూలీలు యాజమాన్యానికి తెలియజేసినా పట్టించు కోలేదని.. ఓబులేసు లిఫ్ట్ చైన్ వైరు తాకడంతో షాక్‌కు గురై మృతి చెందాడని పలువురు తెలియజేస్తున్నారు. కాగా మృతుడికి ఇద్దరు చిన్న పిల్లలు ఉండగా, ఆ కుటుంబం రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. దళితుడైన ఓబులేసు మరణానికి కారణమైన ఫాతిమా కాలేజీపై చర్యలు తీసుకొని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మునెయ్య డిమాండ్ చేశారు.

బొలేరో ఢీకొని..

కేవీపల్లె : రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు మృతి చెందిన సంఘటన మండలంలోని మహల్‌రాజుపల్లె క్రాస్ వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి. కలికిరి మండలం గుండ్లూరుకు చెందిన బాషా (35) శుక్రవారం రాత్రి కలకడ నుంచి స్వగ్రామానికి వెళ్లడానికి ద్విచక్ర వాహనంలో బయలు దేరాడు. అయితే మార్గంమధ్యలోని మహల్ రాజుపల్లె క్రాస్ వద్ద బొలేరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాషాను చికిత్స నిమిత్తం 108 వాహనంలో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రొద్దుటూరులో పేలిన ఐపీ బాంబు!

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో మరో ఐపీ బాంబు పేలింది. ప్రముఖ ఆయిల్‌మిల్లు వ్యాపారి రూ.2.70 కోట్లకు ఐపీ పెట్టినట్లు తెలుస్తోంది. మహాత్మాగాంధీ ఆటోనగర్ ఎదురుగా ఉన్న ఓ ఆయిల్‌మిల్లు యజమాని పెద్ద మొత్తంలో బాకీలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అతను పట్టణంలోని కొంత మంది వ్యక్తులతోపాటు పలు బ్యాంకుల్లో కూడా అప్పులు తీసుకున్నాడు. రెండు రోజుల నుంచి ఆయిల్ మిల్లు మూసి ఉండటంతో పాటు ఇంటి వద్ద కూడా అతను కనిపించలేదు. పైగా ఫోన్ కూడా స్విచ్చాఫ్‌లో ఉండటంతో రుణదాతలు ఆందోళన చెందసాగారు. వ్యాపారంలో ఒడిదుడుకుల వల్ల అతనికి నష్టాలు వచ్చినట్లు పట్టణంలో చర్చ జరుగుతోంది. ప్రొద్దుటూరులోని కోర్టులో వ్యాపారి ఐపీ దాఖలు చేసినట్లు తెలుస్తోంది. రేపో, మాపో రుణదాతలకు నోటీసులు కూడా అందనున్నాయి.

గంజాయి స్వాధీనం

ఖాజీపేట : ఖాజీపేట మండలంలో శుక్రవారం గంజాయి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ మోహన్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చెన్నముక్కపల్లె గ్రామం తూర్పు వైపున దాడులు నిర్వహించామని అన్నారు. అక్కడ గంజాయి, పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 2.570 కేజీల గంజాయితోపాటు రూ 20,500 నగదు స్వాధీనం చేసుకున్నామని అన్నారు.